# BEGINNING

ఎలా ఉన్నావు ఫ్రెండు..! బానే ఉండి ఉంటావులే..! లేకపోతే నాతో ఎందుకు మాట్లాడతావు. ముందు నీకు సారీ చెప్పాలి అని అనుకున్నా కానీ ఫ్రెండ్స్ మధ్య సారీ ఎందుకులే అని చెప్పట్లేదు. సారీ ఎందుకు అని నీకు డౌట్ వస్తే దానికి సమాధానం చలికాలంలో వస్తా అని చెప్పి ఎండాకాలం మొదట్లో వచ్చా కదా అందుకే..!

రామకృష్ణ గాడు రాత్రి 2 గంటలకు అది జైల్లో, తోటి ఖైదీలు అందరు నిద్రపోతున్నా ఎందుకు వీడు చీకటి గదిలో ఒక మూల కూర్చుని నీతో మాట్లాడుతున్నాడు అనే కదా నీ అనుమానం?

ఈరోజు నా కేసులో వచ్చిన జడ్జిమెంట్ కి నిద్ర పట్టడం లేదు. అదిగో, వార్డు ఇంచార్జి వస్తున్నట్టు ఉన్నాడు. కర్రని రాపిడి చేస్తూ వస్తున్నాడు. అది ఆయనకు రొటీన్, వినడం నాకు రొటీన్ అయింది. మొహం మీద టార్చ్ వేశాడు, లైట్ పడకుండా చేయి అడ్డం పెట్టుకున్నాను.

"ఏం రామకృష్ణ.. నిద్ర రావట్లేదా?" అని అన్నాడు.

"అవును అన్న" అని చెప్పాను

"ఎలా వస్తుంది నిద్ర..? ప్రశాంతమైన నిద్ర రావాలంటే పుణ్యం చేయాలి కానీ పాపం చేస్తే వస్తుందా?. అందులోనూ నువ్వు చేసిన పాపం నిన్ను నిద్రపోనిస్తేగా" అని వెటకారంగా వెళ్ళిపోయాడు.

నాలో ఉన్న వెటకారం ఈరోజు పని చేయడం లేదు. నాతో మామూలుగా మాట్లాడితేనే నా సమాధానాలు వెటకారంగా ఉంటాయి. అలాంటిది ఈరోజు అవతల వాడు వెటకారంగా మాట్లాడుతున్నా కూడా మౌనమే సమాధానం అయింది. లేకపోతే, నిద్రపోకుండా కాపలా కాస్తున్న నువ్వు చెప్పాలి నాకు నిద్ర గురించి అని అనేవాడిని కానీ అనలేకపోయా..!

కొన్ని సార్లు మన పరిస్థితికి మౌనమే ఆసరా. మన టైమ్ బాగలేనప్పుడు పనిచేయని గడియారం కూడా మనల్ని చూసి నవ్వుతుంది. మనం ఎవరో తెలియనోడు కూడా పుసుక్కున ఓ మాట అనేస్తాడు. చీకటి గదిలో నీ నీడ కూడా నీకు తోడు ఉండదు. ఒక్క నిశ్శబ్దం మాత్రమే నీకు తోడు. పోనీలే కష్టాలు, కన్నీళ్ళు మామూలేగా అందరికీ. ఒక్కొక్కరికి ఒక్కో టైప్, అయినా టైపిస్ట్ బ్రహ్మ గారు ఎలా రాస్తే అలా..!

పల్లెటూరి ప్రేమకథ అదే నిబ్బా నిబ్బీల కథ అయిపోయింది, ఇక పట్టణం చావు కథ మిగిలింది. ప్రేమ కథ నుండి పుర్రె కథకి షిఫ్ట్ అవబోతున్నాం..! నేను చెప్పిన ప్రేమకథని ఓపికగా విన్న విధానానికి నీకు ఫ్రెండ్ నుంచి బెస్ట్ ఫ్రెండ్ గా ప్రమోషన్ ఇస్తున్నా. నీ పేరు నాకు తెలియదు కాబట్టి బాగా ఆలోచించి నీకు ఒక పేరు పెట్టా.

“చింగు..!” ఎలా ఉంది పేరు? బొంగులా ఉంది, కొరియా పేరులా ఉంది అని అనుకోకు. పేరు బాగుంటుంది. ఆ పేరు నీకు చిరాకుగా ఉన్నా, నిన్ను అదే పేరుతో పిలుస్తాను. ఎందుకంటే నేను నీకు స్నేహితుణ్ణి కాబట్టి.

సరే ఈ సారి ఎటువంటి ల్యాగులు లేకుండా అదే ఇంట్రో, టీజర్, ట్రైలర్, ఆడియో రిలీజ్ లాంటివి లేకుండా నేరుగా కథలోకి వెళ్ళిపోదాం. ఈ కథని నువ్వు మనసుపెట్టి చదువు, ఎందుకంటే ఒకవేళ నా కోడి బుర్రతో సరిగా చెప్పలేకపోయినా, నీ అద్భుతమైన ఐన్ స్టీన్, న్యూటన్ బుర్రలతో దాన్ని అర్థం చేసుకోవాలి కనుక..!

**పద చింగు ఇక మొదలుపెడదాం పుర్రె కథ..కథలోకి ఎగరటం మొదలుపెట్టు..**



# CHAPTER ONE –
# THE RED MOON

**కొందరికి మరణం దాని అంతట అది రాదు, దాన్ని ఆహ్వానిస్తేనే వస్తుంది. అయినా ఇక్కడ మరణం ప్రశ్న కానే కాదు, దాని వెనుక ఉన్న మనిషే ఒక ప్రశ్న..!**

ǂ

అన్యాయం తనకి జరుగుతున్నపుడు సమాజం ప్రశాంతంగా నిద్రపోతుంది..!

సమయం రాత్రి 12 గంటలు. అది నగరానికి వెలుపల ఉన్న కొద్దిగా పూర్తయిన ఒక సర్కిల్ ఆకారంలో ఉన్న మాల్. నాలుగు సంవత్సరాల క్రితం మొదలుపెట్టిన పెద్ద మాల్ కట్టడం కోర్టు ఆదేశాలతో రెండు సంవత్సరాల క్రితం మధ్యలోనే ఆగిపోయి, పాడుబడిన భవనం లాగా మారిపోయింది. చాలారకాల పనిముట్లు చిందరవందరగా అక్కడక్కడ పడి ఉన్నాయి. కొన్ని చోట్ల సగం పూర్తి కాని గోడల్లో చెట్లు, ముళ్ళ పొదలు మొలిచాయి. కంకర, ఇటుకలు, సిమెంట్ బస్తాలు కూడా అక్కడే ఉన్నాయి. కొంచెం దూరంలో కొన్ని రెసిడెన్షియల్ హౌసెస్ ఉన్నాయి.

అక్కడ బజారులో వీధి దీపాలు వెలుతురు ఇస్తుంటే, ఈ పాడుబడ్డ భవనంలో వెలుగు వెన్నెల ఇస్తుంది. కానీ భవనం సర్కిల్ ఆకారంలో ఉండటం వల్ల, దాని నీడ దాని మీదే పడి అక్కడక్కడ కారు చీకటిగా ఉంది.

అప్పుడే అక్కడికి శ్రావణి వచ్చింది. తనకి తెలిసిన ప్రదేశంలా అంతా తిరుగుతూ ఎవరికోసమో వెతుకుతుంది. తన కళ్ళకి ఒక టార్చ్ లైట్ కనపడింది. అది తీసుకొని ఆన్ చేయడానికి ట్రై చేసింది కానీ అది పని చేయడం లేదని అక్కడే

పడేసింది. అదే సమయంలో సడన్ గా ఒక సౌండ్  వినబడగానే, భయంతో ఫోనులో ఉన్న టార్చ్ వేసింది. అక్కడ పందికొక్కు మట్టిని తవ్వుతూ ఉంది. ఆ లైట్ వెలుగుకి అది అక్కడనుండి తొందరగా వెళ్ళిపోయింది. మొదటి అంతస్తులో ఎవరో ఉన్నట్టు ఇంకో టార్చ్ లైట్ వెలుగుతుంది. శ్రావణి చిన్నగా ఫోన్ టార్చ్ వేసుకొని స్టెప్స్ ఎక్కుతుంది. స్టెప్స్ కి అటు ఇటు గోడలు కూడా లేవు. తను స్టెప్స్ ఎక్కుతుంటే ఎదురుగా ఎవరో తన కళ్ళలోకి టార్చ్ వేశారు

"వస్తున్నా బుజ్జి, టార్చ్ ఆపు" అని శ్రావణి చిన్నగా నడుచుకుంటూ స్టెప్స్ ఎక్కుతుంది. మొదటి ఫ్లోర్ చేరుకోగానే అక్కడ ఎవరు లేరు. లైట్ ఒక్కటే వెలుగుతుంది.

"ఆటలు ఆపి బయటికి రా బుజ్జి" అని చిన్నగా చెప్పింది శ్రావణి. వెనకనుంచి ఎవరో తన భుజం మీద చేయి వేసారు. "వచ్చావా బుజ్జి" అని నవ్వుతూ వెనుకకు తిరిగి చూసిన తరువాత నవ్వు మాయమై భయం మొదలైంది. మాస్క్ వేసుకొని ఇంచుమించు ఆరు అడుగులు ఉన్నాడు. చేతిలో తుప్పు పట్టిన ఐరన్ రాడ్. చేతికి గ్లోవ్స్. అతని దేహం సగం వెన్నెల వెలుగులో, సగం కారుచీకటిలో ఉంది. ప్రాణం తీసే యముడిలా కనపడుతున్నాడు. వణుకుతున్న చేతుల్లో నుండి శ్రావణి ఫోన్ కిందకి జారిపోయింది.

పరిగెత్తుతూ స్టెప్స్ దిగుతుంది శ్రావణి. ఆమె గ్రౌండ్ ఫ్లోరుకు రావడానికి ముందే అతను ఫోన్ తీసుకొని మొదటి ఫ్లోర్ నుండి కిందికి దూకాడు. శ్రావణి స్టెప్స్ దిగి కొంచెం దూరంలో ఉన్న గోడ చాటుకు వెళ్ళి భయంతో దాక్కుంది. ఎన్నో వర్షాలకు తడిసిన గోడ పాచి పట్టి ఉంది. భయంతో, చల్లటి గాలి తగులుతున్నా తనకి చెమట ధారగా పోస్తుంది. కొంచెం దూరంలో వెన్నెల వెలుగు ఉన్నా, వెలుగులోకి రావడానికి భయపడి చీకట్లో తన రెండు చేతులను పట్టుకొని గట్టిగా ఊపిరి పీలుస్తూ చీకట్లోనే ఉండిపోయింది. ఆ ప్రదేశంలో తన శ్వాస తప్ప ఇంకేం వినపడటం లేదు. శ్వాస మనం ఉన్న పరిస్తితిని బట్టి మారుతూ ఉంటుంది.

కొన్ని పరిస్థితులు ఎలా ఉంటాయంటే,  వెలుగులోకి వచ్చి కష్టాలు కొని తెచ్చుకోవడం కంటే చీకట్లో కూర్చుని బ్రతకటమే మేలు అన్నట్లుగా. చీకటి

భయాన్ని కలిగించటమే కాదు కొన్ని సార్లు ప్రమాదం నుండి దాక్కోవడానికి కూడా ఉపయోగపడుతుంది.

ఆడపిల్ల పుట్టినప్పటినుండి కాటికి చేరే వరకు ఎప్పుడూ ఎవరో ఒకరు ఆమెని తరుముతూ ఉంటారు. తనని భయపెట్టాలని చూస్తారు. ఆడపిల్ల ఒంటరిగా ఉండాలంటే ఉండలేకపోతుంది కారణం సమాజంలో ఉన్న మానవ మృగాలు. ఆ మృగం మగవాళ్ళ రూపంలో ఉండవచ్చు, ఆడవాళ్ళ రూపంలో ఉండవచ్చు.

శ్రావణి కళ్ళను భయంతో మూస్తూ తెరుస్తూ ఉంది. అప్పుడే తనకి ఏదో అలికిడి అయినట్టు అనిపించింది. వెంటనే కళ్ళు గట్టిగా మూసి ఊపిరి బిగపట్టింది. ఒక సెకను మౌనం తర్వాత చూస్తే, అక్కడ చంద్రుని వెన్నెల పడుతున్న చోట తన ఫోన్ ఉంది. తను బిత్తర చూపులు చూసుకుంటూ, భయం భయంగా ఫోన్ దగ్గరకి వెళ్ళింది. ఫోన్ మీద చేయి పెట్టగానే, ఆ చేతిని యముడు లాంటి నరుడు తొక్కిపట్టాడు. నొప్పితో, ఆందోళనతో తను తల పైకి ఎత్తి చూసింది.

“నీకు టైమ్ వచ్చింది” అని యముడు అన్నాడు.

గుటకలు మింగుతూ అతని వైపే భయంగా చూస్తుంది శ్రావణి.

“ ‘సారీ..’ స్పెల్లింగ్ వచ్చా..?” అని గంభీరంగా అడిగాడు

భయంతో ‘వచ్చు’ అని తల ఊపింది..

వెంటనే ఊపుతున్న తల మీద ఐరన్ రాడ్డుతో బలంగా కొట్టాడు. పైన ఆకాశంలో చుక్కల వలే, ఆమె రక్తపు చుక్కలు అక్కడక్కడ గోడల మీద పడ్డాయి. గాయం వలన, భయం వలన తను కింద పడింది. తనను గోడకు ఆనిచ్చి చీకటిలో కూర్చోబెట్టాడు. ఆ తర్వాత అదే ఇనుప రాడ్డుతో తన మోకాళ్ళ మీద గట్టిగా కొట్టాడు బాధ తెలుస్తుంది కానీ అరవలేకపోతుంది.

కళ్ళలో నుండి నీళ్ళు ధారగా వస్తున్నాయి. ఒంటి నిండా నొప్పి, గుండె నిండా బాధ కానీ తను ఏంచేయలేకపోతుంది, నొప్పిని తట్టుకోలేకపోతోంది. ఆ తర్వాత తన కుడి చేతిని పట్టుకొని విరిచేశాడు. నొప్పి ఎలా ఉందంటే మన మీద లక్ష సూదులు ఒకేసారి గుచ్చితే ఎలా ఉంటుందో అలా. విరిగిన చేయి నుంచి,

మోకాళ్ళ నుంచి రక్తం కారుతుంది. చీకటిగా ఉన్న ప్రదేశం కూడా రక్తం వలన అక్కడక్కడ మెరుస్తూ కనిపిస్తుంది.

"నొప్పి పుడుతుందా శ్రావణి. నీ చేతులు భలే మెత్తగా ఉన్నాయి. నీకొక విషయం చెప్పనా..? గాయం చేసే చేతులు గట్టిగా ఉంటాయి. మోసం చేసే చేతులు మెత్తగా ఉంటాయి. అందుకే నీ చేతులు తొందరగా విరిగాయి. అయినా సాయం చేసే చేతుల కోసం ఎదురుచూస్తున్నావా? అయ్యో పిచ్చి శ్రావణి..! సాయం చేసే చేతులు ఇక్కడ లేవు. పైగా మోసానికి అలవాటు పడిన మనసు ఎప్పుడూ చెడుగా ఆలోచిస్తుంది, చెడే చేస్తుంది. తప్పులని క్షమించవచ్చు కానీ మోసానికి శిక్ష తప్పక అనుభవించాల్సిందే శ్రావణి" అని ఆ ముసుగు మనిషి అన్నాడు.

శ్రావణి కొన ఊపిరితో ఉంది. తనకి ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు. సరిగా కనపడి కనపడని చూపుతో చూస్తుంది. ఆకాశంలో చంద్రుడు తెల్లగా మెరుస్తుంటే అతని నల్లటి మాస్క్ మొహం మీద నుండి తీసాడు. అతని దృఢమైన దేహం మొత్తం చీకటిలో ఉన్నా, అతని మొహం మాత్రం వెన్నెల్లో తడుస్తుంది. శ్రావణి అలానే అతని వైపు భయంగా, ఆశ్చర్యంగా చూస్తూ ఉంది. శ్రావణి కళ్ళలో ఉన్న ఆశ్చర్యం, భయం, ఆందోళన అన్ని 'నన్ను వదిలేయ్ ప్లీజ్' అన్నట్టుగా బ్రతిమిలాడుతున్నాయి. కానీ అతని కళ్ళు మాత్రం 'నిన్ను క్షమించేది లేదు' అన్నట్టుగా బదులిస్తున్నాయి. శ్రావణి చెస్ట్ దగ్గర చేయి పెట్టి ఒక స్లిప్ తీసి జేబులో వేసుకున్నాడు.

శ్రావణి గొంతు మీద పక్కకి ఒక పుట్టుమచ్చ ఉంది. అక్కడే ఉన్న ఇనుప చువ్వతో గొంతు మీద  ఉన్న మచ్చ మీద పొడిచాడు. ఆ చువ్వ తన గొంతును, మచ్చను చీలుస్తూ తడిగా బలహీనంగా ఉన్న గోడలో నుండి బయటకి వచ్చింది. తన కళ్ళు మరియు ముక్కులో నుండి రక్తం కారుతూ తన అందమైన కురులను తడుపుతుంది. శరీరం నొప్పిని తట్టుకోలేక ప్రాణం విడవాలని అనుకుంటుంది. నగరం అంతా నిండుగా వెన్నెల వర్షం కురుస్తున్న రాత్రిలో,  శ్రావణి రక్తం కాలువలాగా తన శరీరం మీద నుండి పారుతుంది. వయ్యారి నడుము వంగిపోయింది. పాల బుగ్గలు నెత్తురుతో తడిచిపోయాయి. లతలాగా ఉండే మెడ గాయంతో సతమవుతుంది.

ఆ సంఘటన జరుగుతున్నపుడు ముగ్గురు మాత్రమే అక్కడ ఉన్నారు. అందమైన తెల్లటి చందమామ, రక్తంతో తడిసిన చందమామ మరియు ప్రాణం తీయడానికి సిద్ధంగా ఉన్న యముడు మాత్రమే. యముడు ప్రాణం తీస్తుంటే ఎర్రటి చందమామ ప్రాణం పోతుంటే, సాక్ష్యంగా వెండి వెన్నెలను కురిపిస్తున్న తెల్లని చందమామ చూస్తుంది కాని మాట్లాడలేదు. బహుశా ఇంతకుముందు చాలా ఘోరాలు చూసి అలవాటు పడి ఉండవచ్చు.

కొన్ని కథలు భయంగా ముగుస్తాయి. శ్రావణి ప్రాణం పోతున్నప్పుడు సమాజం ప్రశాంతంగా నిద్ర పోతుంది. ఈ ప్రపంచంలో ఉన్న వాళ్లందరికి ఒకరితో మరొకరికి సంబంధం లేదు ముఖ్యంగా ఎవరైనా కష్టాల్లో ఉన్నప్పుడు. ఒకరి కష్టం ఇంకొకరికి ఎప్పటికీ వినపడదు, కనపడదు. చావైనా బ్రతుకైనా నీ మనసు మోయాల్సిందే..!



# CHAPTER TWO – THE FAMILY

**ప్రపంచం మొత్తం నీకు ఎదురు తిరిగినా, నీ ఫ్యామిలీ నీకు తోడుగా ఉంటుంది. నీ బలం నీ ఫ్యామిలీ నుండే మొదలవుతుంది.**

ǂ

ప్రేమతో కూడిన బాధ్యత మనల్ని గొప్పగా ఉంచుతుంది, బాధ్యతతో కూడిన ప్రేమ మనల్ని గొప్పగా చేస్తుంది.

అరుగులు అరిగేదాకా ముచ్చట్లు అయిపోయి ఇంటికి వచ్చాను. సమయం రాత్రి ఎనిమిది గంటల ముప్పై నిమిషాలు, కరెంట్ కూడా లేదు. ఆరోజు నిండు పౌర్ణమి. చందమామ తన వెలుగు మొత్తం మా ఇంటి మీదే చూపిస్తున్నట్టు కరెంట్ లేకపోయినా వెలిగిపోతుంది. పైగా చుక్కల తళుక్కుమంటున్నాయి.

నాయనమ్మ ఆరు బయట కుర్చీలో కూర్చొని అన్నం తింటుంది. కాళ్ళు చేతులు కడుక్కొని వరండాలో ఉన్న మంచం తెచ్చి ఆరుబయట నాయనమ్మ కుర్చీ పక్కన వేసాను.

వేడి వేడి అన్నం, మూడు రోజుల క్రితం పెట్టిన మామిడికాయ పచ్చడితో నెయ్యి లేకుండా ముసల్ది లోపలకి నెడుతుంది.

"ముసల్దానా, ఒక్కదానివే కూర్చొని తినకపోతే, నాకు కూడా ముద్దలు పెట్టచ్చుగా" అని అనగానే–

"పెట్టుకొని తినుపోరా. నాకు తిన్నట్టు ఉండదు" అని చిరాకుగా అంది.

"భద్రాచలం సినిమాలో శ్రీహరి లాగా, నరసింహ నాయుడు సినిమాలో బాలకృష్ణ లాగా జాడి పచ్చడి, అరెకరా లో పండిన బియ్యం తింటున్నావు కదే..!" అని వెటకారంగా అన్నాను.

"దిష్టిపెట్టమాకురా దిక్కుమాలినోడా" అని నన్ను గట్టిగా తిట్టింది.

"నా దిష్టి నీకు తగిలితే ఎప్పుడో పోయేదానివి?" అని అంటే,

"ఏడవమాకు, రా తిను" అని పచ్చడి అన్నం నోట్లో పెట్టగానే ఏదో డ్రగ్ ఒంట్లోకి వచ్చినట్టు శక్తి వచ్చింది.

అలా కొన్ని ముద్దల తరువాత..

"ఇంకా ఎంత తింటవురా" అని అసహనంతో నా వైపు చూసింది.

"ఎదిగే పిల్లాడిని పట్టుకొని ఏం మాటలే అవి. ఒక పక్క కూడా నిండలేదే ఇంకా సరే పోయి పెరుగన్నం నిమ్మకాయ పచ్చడి పెట్టుకొనిరా, పో తొందరగా"

"మీ తాత కూడా ఇలానే వేధించేవాడు" అని కోపంగా చెప్పింది.

"అందుకే పైకి పంపించావా?" అని వెటకారంగా అన్నాను.

"ముదనష్టపోడా" అని కోపంగా అరిచింది.

"కోపం తగ్గించుకోవే, మళ్ళీ బీపీ వచ్చి పోతావు"

"నీ పెళ్ళి చేసి అప్పుడు పోతాలే. అయినా పెళ్లి కుదిరింది గా."

"అప్పుడే నాకు పెళ్ళి ఏంటే, ఏదో మీ నస తట్టుకోలేక ఒప్పుకున్నా" అని గొణిగాను.

"పెళ్లి చేస్తే పందికి ఉన్నట్టు డజను మంది పిల్లలు ఉంటారు"

"పందులు మీ కాలమే ముసల్దనా, ఇప్పుడు కాలం మారింది బర్రెలగా ఒకరో, మేక లాగా ఇద్దరో.." అని అంటుండగానే  పెరుగన్నం కోసం ఇంట్లోకి వెళ్ళింది. పెరుగన్నం తెచ్చాక..

"నీ చేత్తో తింటుంటే పీచు మిఠాయిలాగా ఎంతైనా లోపలకి పోతుందే.." అని అంటే

"వాగ కుండా తిన్రా ముందు" అని కసురుకుంది.

చివరి ముద్ద తినే సమయంలో లైట్స్ వెలుగుతూ ఆపుతూ – ఆకాశంలో విమానం ఒకటి వెళ్తూ ఉంది. అప్పుడు నేను "నువ్వు నా ఆకలి తీర్చావు కాబట్టి, నువ్వు పైకిపోయేలోపు పైన వెళ్తున్న విమానంలో ఎక్కిస్తానే" అని అన్నాను.

"మీ తాత కూడా ఇలానే బడాయిలు చెప్పి, నాకన్న ముందే పోయాడు" అని నిష్టూరంగా అంది.

"నిజంగా ఎక్కిస్తానే" అని అనగానే నవ్వుకుంటూ పళ్ళెం కడిగి ఇంట్లో పెట్టి వచ్చి కుర్చీలో కూర్చుంది.

"కాదే ముసల్దాన నీ చేతిలో ఏదో ఉందే. ఎంత తిన్న ఆకలి మాత్రం తీరట్లేదు"

"మీ అయ్యా కూడా చిన్నప్పుడు ఇలానే కూసేవాడు"

"ఎవరు మా నాన్నానా.. మొరటోడికి ఇలాంటి మాటలు కూడా వచ్చా..?"

"ఎవర్రా మొరటోడు?" అని గట్టిగా అరిచింది.

"తమరి సంతానమే" అని మామూలుగా చెప్పాను.

"నోరు ముయ్యారా.. నా కొడుక్కేం బంగారం. చాలా సున్నితమైన వాడు"

"సున్నిపిండేం కాదు, ఇదిగో ఇక్కడ చేతి మీద చూడు, తమరి సున్నిత పుత్రుడు నన్ను మొదటిసారి అవుట్డోర్ లో కొట్టినప్పుడు తగిలిన గాయం" అని చూపించాను.

ఏడోవ తరగతి చదివే రోజుల్లో.. ఒకరోజు ఇంటికి వచ్చేసరికి మా నాన్న అమ్మని అరుస్తున్నాడు. కోపంతో చిన్న దెబ్బ కూడా కొట్టాడు. అమ్మని కొట్టగానే నాకు చాలా కోపం వచ్చింది. కొట్టిన తర్వాత కోపంగా బయటకు వెళ్లేటప్పుడు, పుస్తకాల సంచి కింద పెట్టకుండా నాన్నని కొర కొర చూసాను.

"ఎందిరా అలా చూస్తున్నావు" అని కోపంగా అన్నాడు.

అమ్మని కొట్టాడని కోపంతో "నీకెందుకు" అని అన్నాను.

అక్కడే ఉండు నాకొడకా అని చాలా కోపంతో నా దగ్గరకి వచ్చాడు. భయంతో సంచి అక్కడ పడేసి బయటకి పరిగెత్తాను. కర్ర తీసుకుని పరిగెత్తుకుంటూ నా వెనకే వచ్చి మరి బజారు మధ్యలో పట్టుకొని బర్రెని కొట్టినట్టు కొట్టాడు. ఉచ్చ కాలువలో పడితే లేపి మరి కొట్టాడు. బజారులో ఉన్న వాళ్లందరూ అవుట్డోర్ షూటింగ్ జరిగే సినిమా చూసినట్టు వింతగా

చూస్తున్నారు. మా నాన్న కొట్టే దెబ్బల కన్నా, వాళ్ళ చూపులే ఎక్కువ నొప్పి కలిగించాయి.

"చూడే ముసల్దానా అప్పుడు మోచేతికి తగిలిన గాయం మానింది కానీ నీ కొడుకంటే భయం, గాయం తాలూకు మచ్చ ఇంకా వంటి మీద అలానే ఉంది."

"ఆరోజు నిన్ను కొట్టినప్పుడు మీ నాన్న చాలా బాధపడ్డాడురా.."

"నన్ను కాదే మా అమ్మని కొట్టాడు చూడు అందుకు కోపం ఇంకా తగ్గలేదు"

"ఆరోజు ఏం జరిగిందో నీకు తెలియదురా.."

"ఏందే అంత గొప్ప గతం"

"గొప్పది కాదురా విలువ కట్టడానికి సరిపోని గతంరా అది" అని ఏం జరిగిందో చెప్పింది.

మీ అమ్మకి బాగలేకపోతే మీ అమ్మ వద్దన్నా వినకుండా ఆరోజు హాస్పటల్‌కి తీసుకెళ్లాడు, డాక్టర్ అన్నాడంట ఇప్పుడు ఏం చేసినా ఉపయోగం లేదు. కొన్ని నెలల ముందు తీసుకొని రావాల్సింది. మీ నిర్లక్ష్యం ప్రాణాన్ని హరిస్తుంది అని. బిక్క మొహం వేసుకొని వచ్చారు.

"కాదే.. ఇన్ని రోజుల నుండి చెప్పకుండా ఏం చేస్తున్నావే.." అని మీ అమ్మని అడిగాడు.

"మామూలు నలతే అనుకున్నా.." అని సమాధానం ఇచ్చింది.

"ఎన్నిసార్లు అడిగా నిన్ను, అలా ఉన్నావు ఏంది అని. చెప్పావా అసలు." కొంచెం కోపంగా అడిగాడు.

"చూపించుకుంటే డబ్బులు అయిపోతాయని, అసలే కొంచెం ఇబ్బందుల్లో ఉన్నాం కదా" అని చెప్పింది.

"డబ్బులైపోతే మళ్ళీ సంపాదించుకోవచ్చు. ప్రాణం పోతుంది ఇప్పుడు." అని బాధపడుతూ చెప్పాడు.

"నేను ముందు చూపించుకున్న పోయే ప్రాణం ఏమి ఆగదు" అని మీ అమ్మ చాలా నిర్లక్ష్యంగా చెప్పింది.

ఆ మాటకి మీ నాన్నకి కోపం వచ్చి మొదటి సారి మీ అమ్మని ఒక దెబ్బ కొట్టాడు రా. అది నిజానికి కోపం కాదు, బాధ, అసహనం ఏమి చేయలేకపోతున్నాను అనే నిస్సహాయత. అన్ని కలిసి ఆరోజు మొదటిసారి మీ అమ్మ మీద చేయి చేసుకున్నాడు.

ఆ సమయంలో మన ఊరి సర్పంచ్ లాగా నువ్వు మధ్యలో దూరావు, మీ అమ్మ మీద ఉన్నదంతా నీకు తగిలింది.

ఆరోజు నిన్ను మీ అమ్మ పడుకోబెట్టాక పడుకున్నావు, ఇప్పుడు పడుకున్నావు కదా ఇలానే, ఇక్కడే పడుకున్నావు. ఇంకో మంచం మీద మీ అమ్మ పడుకుంది. మీ నాన్న నేను కూర్చున్నాము.

ఆరోజు మీ అమ్మ ఏడుస్తూ.. నేను లేకపోతే వీడు ఏమైపోతాడో అని బాధపడింది. మీ నాన్నకి బాధపడటం తెలియదు, బాధని భరించటమే తెలుసు. ఆరోజు మీ నాన్నని పట్టుకొని మీ అమ్మ ఎంతో ఏడ్చింది. తను బ్రతకదు అని కాదు, తను లేకుండా నువ్వు మీ నాన్న ఎలా ఉంటారో అని. మీ అమ్మకి వచ్చే చావంటే అసలు భయం లేదు కానీ మీరు ఎలా ఉంటారో అని దిగులుపడేది.

ఆ మరుసటి రోజు మీ నాన్న డాక్టర్ గారి దగ్గరికి పోతే, తను బ్రతికేది కొద్ది రోజులే, మీరు ఎన్ని డబ్బులు పెట్టినా అవి వృధా మాత్రమే అని చెప్పాడు. కానీ, మీ నాన్న తనకి ఉన్నదంతా అమ్మి, దొరికిన చోట అప్పు చేసి మీ అమ్మని ఆరు నెలలు బ్రతికించాడు.

ఎందుకురా ఈ మూర్ఖపు నిర్ణయం అని మీ నాన్నని అడిగితే.. "ఈ ఆరు నెలల్లో, తల్లి లేకపోయినా తన కొడుకు బ్రతకడం అలవాటు చేసుకున్నాడు. భార్య లేకుండా తన భర్త బ్రతకటం నేర్చుకున్నాడు. తను లేకపోయినా తన భర్త, పిల్లవాడు బ్రతగగలరనే నమ్మకం తనకి కలిగింది.

వీటన్నింటికీ మించి ఏదైనా అద్భుతం జరిగి తను మామూలు మనిషి అవుతుందేమో అని చిన్న ఆశ. నేను సంపాదించిందంతా పోయిన, ఇంకా అప్పులు అయినా, ఈ నా ఆశకి ఏ విలువలు సరితూగవమ్మ" అని ఏడుపు గొంతుతో చెప్పిన మాటలు నాకు ఇంకా గుర్తున్నాయిరా..

మనం తీసుకునే మూర్ఖపు నిర్ణయాల వలన నష్టం ఎక్కువ కలిగినా, మనసుకి అది ఇచ్చే తృప్తి నీకు జీవితాంతం తోడు ఉంటుంది. నష్టం కలిగించిన ప్రతి మూర్ఖపు నిర్ణయం చెడ్డది కాదు. ప్రేమ, డబ్బు ఈ రెండు దాచుకోవడంలో ఉన్న తృప్తి కన్నా ఎక్కడ ఖర్చుపెట్టాలో తెలిస్తే ఉండే తృప్తి ఎక్కువ.

వృధా అవుతుంది అని తెలిసిన కొన్నిసార్లు ప్రయత్నించాలి, నష్టం వస్తుంది అని అర్థమైన కొన్నిసార్లు కొనసాగించాలి, అదే నిజమైన ప్రేమంటే. మీ నాన్నకి అంతా తెలుసురా..

మీ నాన్నకి ప్రేమ ఎక్కువ. కాని మాటల్లో చెప్పలేడు. మీ అమ్మ లాగా దగ్గరికి తీసుకొని చెప్పలేడు. ఏదైనా మీ అమ్మ మాత్రం తను లేకపోయినా మీరు బ్రతకగలరు అనే ఆనందంతో కన్ను మూసింది. మొండిది బ్రతకడానికి ప్రయత్నించింది అనేకన్నా మీ ప్రేమని చూసుకోవడానికి ప్రయత్నించిందని చెప్పాలి.

తన గురించి ఆలోచించితే ప్రాణమే జీవితం అవుతుంది కానీ తన వాళ్ళ గురించి ఆలోచించితే జీవితమే ప్రాణం అవుతుంది. ఎన్ని ఇబ్బందులు ఎదుర్కున్నాడో మీ నాన్న, కొన్ని రోజులు ఒక్క పూటే తిన్నాడు. ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాడు.

మీ అమ్మకి నువ్వంటే ప్రాణం రా. తను చచ్చిపోయే క్షణం ముందు కూడా నిన్నే అడిగింది. నువ్వు అదృష్టవంతుడివి రా, ప్రతి తల్లి తండ్రి తమ పిల్లలను ప్రేమిస్తారు కాని నీ తల్లి తండ్రులు నీకు ప్రేమతో పాటు ఇంకా చాలా ఇచ్చారు.

ఏమి ఇచ్చారనేది నువ్వు చేసే ప్రతి పనిలో కనిపిస్తుంది. తల్లి తండ్రుల పెంపకం నువ్వు సంపాదించే రూపాయిలో కన్నా, నీ చుట్టూ ఉన్న వాళ్ళకి నువ్వు కనిపించే విధానంలో తెలుస్తుంది.

బాధ్యతకు మించిన బరువు ఉండదేమో ఈ ప్రపంచంలో. బాధ్యత మోయాలంటే ఎన్నో భరించాలి.

మా ముసల్ది చెప్పింది వినగానే మనసంతా భారంగా మారడం మొదలైంది. కానీ దాన్ని బయట పడనీయకుండా “ఇక పో పడుకో ముసల్దాన, అందరూ పోతున్నారు నువ్వు తప్ప..” అని అన్నాను.

"నేను ఎడికి పోతారా, వందేళ్లు బ్రతుకుతా.." అని చిన్నగా నవ్వింది.

"నువ్వు పోకపోతే నేనే చంపేస్తా.."

"పోలీసులు ఊరుకోరులే నల్ల పిల్లి మొహమోడ."

"ఊరుకోక, రేపు వచ్చి నన్ను పట్టుకొని వెళ్తారా ఏంటి?"

"పడుకోరా దిక్కుమాలినోడా" అని అంటూ.. ముసల్ది లోపలికి వెళ్ళిపోయింది.

చల్లగా గాలి వీస్తోంది. లుంగీతో చొక్కా లేకుండా, నవారు మంచం మీద మంచి దుప్పటి పరిచి, కప్పుకోవడానికి చాలా తేలికైన దుప్పటి, మా నాయనమ్మ పాత బట్టలతో తయారుచేసిన దిండు వేసుకొని పైన ఆకాశంలోకి చూస్తుంటే, నా మనసు మెదడు రెండు పోటాపోటీగా ఉరకలేస్తున్నాయి.

చుక్కలన్నీ చాలా దగ్గరగా కనపడుతున్నాయి. ముడ్డి కిందకి పాతికేళ్లు దాటినా, ఆ క్షణం చిన్న పిల్లాడిలా మారిపోయాను. చేయి చాపి పట్టుకోవాలని చూస్తే అందనంత దూరంలో ఉన్నాయి. మెరుస్తున్నాయి, కొన్ని తమ స్థానాన్ని మార్చుకున్నట్టు అనిపిస్తున్నాయి, కొన్ని దగ్గరవుతున్నాయి, కొన్ని మాయమవుతున్నాయి. చందమామలో పేదరాశి పెద్దమ్మ, మా నాయనమ్మ లాగా కనబడుతుంది. ఒక చెట్టు కనిపిస్తుంది. వీటన్నింటి మధ్యలో నా జ్ఞాపకాలు మెల్లగా నన్ను ఆవహిస్తున్నాయి.

చందమామ ఎంత గుండ్రంగా ఉందంటే, రోజు మా అమ్మ నుదుటిపై పెట్టుకొనే చిన్న బొట్టులాగా. భూమిపైన దేవతలా ఉన్న అమ్మ ఇప్పుడు ఆకాశంలో విహరిస్తోంది. కన్నీటి చుక్కలతో సాగనంపిన అమ్మ చుక్కలతో కలిసి చక్కని చుక్కలా మారింది. ఇప్పుడు చుక్కల్లో ఉన్న అమ్మ, తను బ్రతికి ఉన్నప్పుడు ఎన్నో చుక్కలను కలుపుతూ అందమైన ముగ్గులు వేసేది. పండగలకి తను వండిన పిండి వంటలు మా ఆయుష్షుని పెంచేవి.

నా పుట్టిన రోజుకి తల స్నానం చేయించి, పక్క పాపిడి దువ్వి, చిన్న బొట్టు పెట్టి, ఆశ చాక్లెట్లు పళ్ళెం నిండా పోసుకొని బజారులో పంచిన క్షణం. అందరు యూనిఫాం వేసుకుంటే, అమ్మ వేసిన కొత్త డ్రెస్‌తో స్కూల్‌కి వెళ్ళిన సమయం, తలుచుకుంటే చాలా సంతోషంగా ఉంటుంది. ఒక చుక్కలో అమ్మ

కనపడుతుంది. ఇది ఖచ్చితంగా నా భ్రమే..! అయినా కానీ అమ్మతో కొన్ని మాటలు చెప్పాలనుకుంటున్నా.

"మన ఇద్దరం వేరు కాదమ్మా, నీ రక్తమాంసాలతో ముద్దగా ఏర్పడి తొమ్మిది నెలలు నీ కడుపులో పెరిగి నీ పేగు తెంపుకొని బయటకి వచ్చాను. నేను చూస్తున్నది నువ్వు ఇచ్చిన చూపుతోనే, నేను నడుస్తున్నది నువ్వు ఇచ్చిన కాళ్ళతోనే, అంతెందుకు ఈ ఊపిరే కూడా నువ్వు ఇచ్చిందే. అమ్మ చివరగా ఒక్క మాట నన్ను కన్నందుకు, నన్ను ఈ ప్రపంచానికి పరిచయం చేసినందుకు చాలా థాంక్స్"

"మీ నాన్నని బాగా చూసుకో" అని చెప్పి అమ్మ నా నుండి దూరంగా వెళ్ళిపోయింది. చింగు నీకు అమ్మ ప్రేమ గురించి కొన్ని విషయాలు చెప్పాలనుకుంటున్నాను..

అమ్మ ఉన్న వాళ్ళకి అమ్మ ప్రేమ తెలుస్తుంది. అమ్మ లేని వాళ్ళకి అమ్మ విలువ తెలుస్తుంది. అమ్మ పుట్టినప్పుడు ఉండి తర్వాత దూరం ఐతే అమ్మకి అర్థం తెలుస్తుంది. ఆ అర్థానికి ఈ చిన్న అక్షర రూపం.

అమ్మ... ఈ పదాన్ని మించిన శక్తి లేదు, ఈ పదాన్ని మించిన త్యాగం లేదు. అంతే కాదు అమ్మ ప్రేమకి కొలమానం లేదు. ప్రేమతో బంధాన్ని నిలిపేది అమ్మ. నవమాసాలు కడుపులో మోసి, బ్రతికినంత కాలం కడుపు తీపితో బ్రతికేది అమ్మ..

అర్థభాగమయ్యే భార్యలు ఉంటారు, అర్థం చేసుకోలేని భార్యలు ఉంటారు. ప్రేమని పంచే అక్కా చెల్లెళ్ళు ఉంటారు, చిన్న విషయాలను కూడా భూతద్దంలో చూసే అక్కచెల్లెళ్ళు ఉంటారు. ఇలా ఏ బంధంలో అయినా మంచి చెడులు ఉంటాయి కాని అమ్మ అనే పవిత్ర బంధంలో మంచి మాత్రమే ఉంటుంది.

ఇంద్రధనుస్సులోని రంగుల కన్నా అమ్మ మదిలో మన గురించి ఆలోచనలు అందంగా ఉంటాయి. గ్రహాల అమరిక కన్నా, అమ్మకి మన మీద ఉన్న ప్రేమ అనే అమరిక చాలా అద్భుతమైనది. సూర్యుడి వెలుగుకన్నా మన జీవితం ఇంకా వెలుగులోకి రావాలని కోరుకునే అమ్మ ఆరాటం గొప్పగా ఉంటుంది. చంద్రుడి వెన్నెల కన్నా మనం చల్లగా ఉండాలని కోరుకునే మంచి మనస్తత్వం అమ్మకి ఉంటుంది. అంతెందుకు దేవుడి ప్రేమలోనైనా

హెచ్చుతగ్గులు ఉంటాయేమో కానీ అమ్మ ప్రేమ మాత్రం మనపై ఎప్పుడూ ఎత్తులోనే ఉంటుంది. అలాంటి అమ్మ ప్రేమ మీ అందరికీ కలకాలం ఉండాలని, అలాగే నువ్వు మీ అమ్మను సంతోషంగా ఉంచాలని ఆశిస్తున్నాను చింగు..

ఇక నాన్న వంతు, అమ్మ ప్రేమకి అలంకరణగా పోయెట్రీ ఉంటుందేమో కానీ నాన్న మోసే బాధ్యతలను పోయెట్రీతో పోల్చలేము. కారణం నాన్న అనే పేరులో ఉన్న వైబ్రేషన్స్, వేరియేషన్స్, క్యారెక్టరైజేషన్స్ అలాంటివి మరి.

మా నాన్న మోయలేనంత బరువైన బాధ్యతలను తన భుజాల మీద మోస్తూ, చెప్పలేనంత ప్రేమ ఉన్నా కాని చెప్పుకోలేక చూపించలేక తను ఎలా బ్రతుకుతున్నాడో బహుశా నాకు నా పెళ్ళాం నేను నాన్నని అవుతున్నా అని చెప్పినప్పుడు మాత్రమే అర్థమవుతుందేమో..!

కొమ్మని చూస్తాం బాగా పెరిగింది అని అనుకుంటాం. కాయల్ని చూస్తాం, బాగా కాసాయి అని అనుకుంటాం. కానీ మొదలను సరిగా చూడం. ఆ మొదలు అమ్మ. వీటన్నింటితోపాటు అసలైనవి ఎవరికీ కనపడకుండా భూమిలోకి పాతుకుపోయి ఉండేవి వేర్లు. అవి కనపడవు కానీ, అవి లేకుంటే కొమ్మ లేదు, కాయ లేదు, మొదలు లేదు. అటువంటి చెట్టు వేర్లే నాన్న. 'నాన్న నువ్వు నన్ను కొట్టిన క్షణాలు అప్పుడు భయంగా అనిపించినా, ఇప్పుడు మాత్రం అవి మరిచిపోలేని మధురానుభవాలుగా అనిపిస్తున్నాయి.

ఎలా పడితే అలా ఉన్న నేను, నువ్వు ఇంటికి వచ్చాక నేను చేసిన యాక్టింగ్ నాకు ఆస్కార్ ఇవ్వవచ్చు ఏమో. నాన్న నిన్ను కొన్నిసార్లు అర్థం చేసుకోలేకపోయాను నన్ను క్షమించు.

నాన్న ఆ పేరులో ఏదో మోటివేషన్ ఉంది. ప్రపంచంలో ఉన్న ప్రతి కష్టం నాన్న పేరు ముందు దిగదుడుపే. నాకు మా నాన్నని చూస్తుంటే.. ఎంత కష్టంగా ఉన్నా కూడా ప్రయత్నించాలి, మహా ఐతే ఫెయిల్ అవుతాం. ఫెయిల్యూర్ మన జీవితానికి ఒక అనుభవం, ఒక పాఠం నేర్పుతుంది. మనం ఎవరో, ఎలాంటి వాళ్ళమో మన నవ్వులో కాదు, మనం బాధలో ఉన్నపుడు తెలుస్తుంది. నాన్న నువ్వు మాత్రం కేక..

చీకటి లేకపోతే వెలుగు గొప్పతనం తెలియదు. వెలుగు లేకపోతే చీకటి బాధ తెలియదు. వెలుగు చీకటి రెండు జీవితానికి సరిపడా ఉండాలి. ఏ ఒక్కటి